


భూసేకరణ లొల్లి

పచ్చని పల్లెలో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు అంశాన్ని మొండిగౌరెల్లి వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. 8లో▸



పేరు ఘనం.. ఊరు శూన్యం!

పేరు గొప్ప ఊరు దిబ్బ అనేలా మారింది అల్మాస్‌ఖాన్‌పేట్ పరిస్థితి. ఈ ఊరులో ఒక్కరు కూడా నివాసం ఉండరు. 8లో▸



న్యూస్‌రీల్

పరీక్ష రాస్తుండగా విద్యార్థినికి అస్వస్థత



విద్యార్థిని రిషిక

పరిగి: పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థిని అస్వస్థతకు గురైన సంఘటన పరిగి పట్టణంలోని నంబర్ 2 ఉన్నత పాఠశాల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. దోమ మండలం ఊటుపల్లికి చెందిన రిషిక పరిగిలోని నంబర్ 1 ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శనివారం హిందీ పరీక్షకు హాజరైన బాలిక కేంద్రంలోని వెళ్లి పరీక్ష పేపర్ ఇవ్వగానే(ఉదయం 9గంటల 45 నిమిషాలకు) కళ్లు తిరిగి పడిపోయింది. బాలికను ఆస్పత్రికి తరలించారు. కాసేపటి తర్వాత కోలుకోవడంతో పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. దాదాపు గంటన్నర పరీక్ష రాయలేదని విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు.

మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

కలెక్టర్ ప్రతీక్ జైన్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయుల జయంతిని విజయవంతం చేసేందుకు అందరి సహకారం అవసరమన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఎస్సీడీడబ్ల్యూఓ మల్లేశం, డీఎండబ్ల్యూఓ కమలాకర్ రెడ్డి, డీఐఓ శంకర్ నాయక్, దళిత సంఘాల నాయకులు రాజలింగం, కృష్ణయ్య, నర్సింలు, రామచంద్రయ్య, అశోక్ కుమార్, జగదీశ్వర్, మల్లేశం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

‘కోట్‌పల్లి’ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

తాండూరు: వికారాబాద్ జిల్లాలోని కోట్‌పల్లి ప్రాజెక్ట్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకే మణిహారం లాంటిదని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం అసెంబ్లీలో ఎమ్మెల్యేకు మాట్లాడే అవకాశాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కల్పించారు. ఈ సందర్భంగా తాండూరు నియోజకవర్గ పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్ట్‌ను పర్యాటక కేంద్రంగా మార్చాలని కోరారు. ప్రాజెక్ట్‌కు శని, ఆదివారాల్లో హైదరాబాద్ నుంచి వారానికి 5 నుంచి 10వేల మంది వరకు పర్యాటకులు సందర్శనకు వస్తారని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్ట్ వద్ద అరకొర వసతులు ఉండటంతో వచ్చిన పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పరిగి నియోజకవర్గానికి చెందిన మన్నెగూడ గ్రామానికి చెందిన ముగ్గురు పట్టభద్రులు ఒకరి తర్వాత మరొకరు ప్రాజెక్టులో పడి చనిపోయారని గుర్తు చేశారు. జిల్లాలో ఉన్న అనంతగిరి గుట్ట హైదరాబాద్‌కే తలమానిక్యంగా నిలిచిందన్నారు. అలాంటి ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.

ప్రతి నీటిచుక్కనూ ఒడిసిపట్టాలి


భూగర్భజలాల జిల్లా అధికారి రవిశంకర్

పరిగి: ప్రతి నీటి చుక్కను వృథా చేయకుండా ఒడిసిపట్టాలని భూగర్భజలాల జిల్లా అధికారి రవిశంకర్ సూచించారు. పరిగి మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో భూగర్భజల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు నీటి వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూగర్భజలాలు అడుగంటకుండా ఉండాలంటే నీటిని వృథా చేయరాదన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని సూచించారు. వర్షపు నీరు దిగువకు వెళ్లకుండా కందకాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీటిని పొదుపు గా వాడుకోవాలన్నారు. అనంతరం భూగర్భ జలాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహాయక సంస్థ నిర్వాహకులు నర్సింహులు, రాములు, వెంకటయ్య, యదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లు.. ఇక్కట్లు!

కూరగాయల మార్కెట్లలో కనీస సౌకర్యాలు కరువు

వారాంతపు సంతలు, తైబజార్లు, ఇతర మార్కెట్ల ద్వారా పంచాయతీలు, మున్సిపాలిటీలకు లక్షల్లో ఆదాయం వస్తున్నా వ్యాపారులు, ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ కూరగాయలు విక్రయించాల్సి వస్తోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకపోవడం, రోడ్ల పక్క సంతల కారణంగా ఇబ్బంది పడుతున్నామని ప్రజలు అంటున్నారు. జిల్లాకు నాలుగు ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు మంజూరైనా ఏ ఒక్కటీ అందుబాటులోకి రాలేదు. అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి.. సంతలు, తైబజార్లు, రైతు బజార్లలో నెలకొన్న సమస్యలపై ‘సాక్షి’ ప్రత్యేక కథనాలు.



వికారాబాద్‌లో అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

- ఎండలోనే క్రయ విక్రయాలు
- తాగునీటికీ అవస్థలు
- కాలకృత్యాలు తీర్చుకోవాలంటే ఆరుబయటికే..
- రైతు బజార్లలో కానరాని అన్నదాతలు
- ఇబ్బందుల్లో వ్యాపారులు, ప్రజలు

వికారాబాద్‌పట్టణంలోని కూరగాయల మార్కెట్లు, రైతు బజార్లలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస సౌకర్యాలు లేక వ్యాపారులు, రైతులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రైతు బజార్ల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. వికారాబాద్‌లోని అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో పరిస్థితి కాస్త మెరుగ్గా ఉన్నా.. కూరగాయల మార్కెట్, రైతు బజారులో తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. రైతులు తెల్లవారుజామునే పంట ఉత్పత్తులతో మార్కెట్లకు వస్తుంటారు. వారు కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆరుబయటికి వెళ్తున్నారు. సంతలు, తైబజార్లు, రైతు బజార్ల ద్వారా పంచాయతీలు, మున్సిపాలిటీలకు లక్షల్లో ఆదాయం వస్తున్నా వసతులు కల్పించడం లేదని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతూ కూరగాయలు విక్రయించుకోవాల్సి వస్తోందని వ్యాపారులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు

గత ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేయాలని భావించింది. ఇందుకోసం అనుమతులు కూడా మంజూరు చేసింది. నాలుగేళ్ల క్రితం పనులు ప్రారంభమైనా నేటికీ భవనాలు అందుబాటులోకి రాలేదు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పట్టణాల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు చేపట్టినా ఏ ఒక్కటీ పూర్తి కాలేదు. కొన్ని చోట్ల పనులు ప్రారంభించి మధ్యలోనే ఆపేశారు. మరికొన్ని చోట్ల పనులు కూడా ప్రారంభించలేదు. వికారాబాద్ పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు పిల్లర్లకే పరిమితమయ్యాయి.



వికారాబాద్ రైతు బజారులో ఎండలో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

పేరుకే పెద్ద మార్కెట్

పరిగి: పట్టణంలో ప్రతి శుక్ర, శనివారాల్లో సంత జరుగుతుంది. పెద్ద సంత కావడంతో పలు కాలనీల నుంచి ప్రజలు కూరగాయలు, ఇతర సరుకులు కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. గ్రామాల నుంచి రైతులు, వ్యాపారులు పంట ఉత్పత్తులు తెచ్చి ఇక్కడ విక్రయిస్తుంటారు. సంతలో తాగునీటి వసతి లేక ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆరుబయటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్ ద్వారా ఆదాయం బాగానే వస్తున్నా వసతులు మాత్రం కల్పించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే పరిగి మార్కెట్‌లో ధాన్యం విక్రయించేందుకు పెద్ద సంఖ్యలో రైతులు వస్తుంటారు. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. రోడ్డు పక్క కూరగాయల మార్కెట్ నిర్వహిస్తుండటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మార్కెట్, సంతల్లో సౌకర్యాలు కల్పించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



పరిగి పట్టణంలో రోడ్డు పక్కన నిర్వహిస్తున్న కూరగాయల సంత

పేరుకే మార్కెట్ యార్డు

- క్రయ విక్రయాలు లేక వెలవెల
- కనిపించని రైతు బజార్



కొడంగల్ సమీకృత కూరగాయల మార్కెట్

కొడంగల్: పట్టణంలో పేరుకే వ్యవసాయ మార్కెట్ యార్డు ఉంది. మూడు దశాబ్దాలు గా క్రయ విక్రయాలు లేక నిరుపయోగంగా మారింది. పట్టణంలో సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మించినా సంతలోనే కూరగాయలు విక్రయిస్తున్నారు. 1994లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కొడంగల్ మార్కెట్ యార్డుకు శంకుస్థాపన చేశారు. కొంత కాలంపాటు మార్కెట్ సజావుగా సాగినా ఆ తర్వాత క్రమవిక్రయాలు ఆగిపోయాయి. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల్ మండలాల్లో సుమారు 40 వేల హెక్టార్లలో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కంది, పత్తి, పెసర, మినుము, వరి పంటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. పండించిన పంటను దళారులకు విక్రయించి రైతులు మోసపోతున్నారు. ధరలోనూ తూకంలోనూ అన్యాయం జరుగుతోంది. నియోజకవర్గంలోని నల్లరేగడి భూముల్లో కంది పంట ఎక్కువగా పండుతోంది. ఇక్కడ పండించిన కందులకు తెలంగాణాతో పాటు ఏపీ, మహారాష్ట్రల్లో మంచి డిమాండ్ ఉంది. మార్కెట్ యార్డును ప్రారంభిస్తే మేలు జరుగుతుందని రైతులు కోరుతున్నారు.



తాండూరు పట్టణంలో రోడుపై కూరగాయల విక్రయం

రోడ్లపైనే కూరగాయల విక్రయం

తాండూరు: పట్టణంలో ఏడేళ్ల క్రితం దాదాపు రూ.80 లక్షల నిధులతో నిర్మించిన రైతుబజార్ అలంకారప్రాయంగా మారింది. కొన్నాళ్ల పాటు ఇక్కడ కూరగాయలను విక్రయించారు. ప్రజలు రాకపోవడంతో మళ్లీ రోడ్లపై విక్రయించడం మొదలు పెట్టారు. దీంతో ఇటు వ్యాపారులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. వసతులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. తాగునీరు కూడా కొనుక్కోవాల్సి వస్తోందని వ్యాపారులు తెలిపారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని భావించిన ప్రభుత్వం తాండూరు పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.5 కోట్లతో ఎడ్లబజార్ ప్రాంగణంలో పనులను చేపట్టారు. అయితే పిల్లర్ దశలో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం రైతులు రోడ్లపైనే కూరగాయాలు విక్రయిస్తున్నారు. ఇప్పటికై నా ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణపనులు పూర్తి చేయాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.



కుల్కచర్లలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వాహన సేవలను ప్రారంభిస్తున్న ఎంపీ కొండా

ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కుల్కచర్ల: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ బడుల్లో మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు జేకేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన వాహన సేవలను శనివారం కుల్కచర్లలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు, బీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెన్న ఈశ్వరప్ప, మిట్టా పరమేశ్వర్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్యారెడ్డి, టెలీకాం కేంద్ర కమిటీ సభ్యుడు ఘణపురం వెంకటయ్య, దిశ కమిటీ సభ్యుడు జానకిరాం, ఎంఈఓ హబీబ్ అహ్మద్, చౌడాపూర్, దోమ మండలాల అధ్యక్షులు శ్రీనివాసులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి మన బాధ్యత

ధారూరు: పాఠశాలలను బాగు చేసుకోవడం మన బాధ్యత అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ బడుల్లో మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు జేకేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన వాహన సేవలను శనివారం ధారూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 80శాతం మంది విద్యార్థినులకు మరుగుదొడ్లు లేవని తెలిపారు. తెలంగాణలో పాఠశాలల అభివృద్ధి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు నాణ్యమైన భోజనం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దిశ కమిటీ జిల్లా సభ్యుడు వడ్ల నందు, పార్టీ జిల్లా, మండల అధ్యక్షులు రాజశేఖర్, రాజునాయక్, జెడ్పీ మాజీ చైర్మన్ కెఎస్ రత్నం, జేకేఎంఆర్ ట్రస్టు కోఆర్డినేటర్ రాములు, నాయకులు నరోత్తమ్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, ఎం.రమేశ్, జగదీశ్వర్, విజయల్క్ష్మి, కృష్ణ, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారిన ప్రశ్న పత్రాలతో విద్యార్థులకు నష్టం కలగలేదు

- పరీక్ష ప్రారంభమైన 15 నిమిషాల్లోనే గుర్తించాం
- సరైన పేపర్లు అందజేసి అదనపు సమయం ఇచ్చాం
- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

తాండూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి తాండూరులోని సెంటర్లలో మారిన ప్రశ్నపత్రాలతో విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగలేదని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. ‘పేపర్లు తారుమారు’ శీర్షికతో సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ విషయమై నివేదిక ఇవ్వాలని సూచించడంతో అధికారులు ఆయా సెంటర్లకు వెళ్లి వివరాలు సేకరించి, నివేదిక పంపించారు. ఈ అంశంపై డీఈఓ మాట్లాడుతూ.. తాండూరులోని శివసాగర్ స్కూల్ పరీక్ష కేంద్రంలో గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి నాగలక్ష్మికి 01టి పేపర్‌కు బదులు 03టి పేపర్ ఇచ్చారన్నారు. ఇది గుర్తించిన సిబ్బంది 15 నిమిషాల్లోనే అసలు పేపర్ ఇచ్చి పరీక్ష రాయించారని స్పష్టంచేశారు. విద్యార్థి నష్టపోయిన 15 నిమిషాలకు అదనపు సమయం ఇచ్చామని తెలిపారు. ఫ్రంట్‌లైన్ పాఠశాలలో జరిగిన తప్పిదాన్ని కూడా గుర్తించి వెంటనే సరిచేశారన్నారు.

ట్రైనీ కలెక్టర్‌కు ఘన వీడ్కోలు

అనంతగిరి: ఉన్నత స్థానంలో ఉన్న అధికారులు ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకొని ఏడాది శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకొని బదిలీపై వెళ్తున్న ఉమాహారతికి శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. అంతకుముందు నిర్వహించిన సమావేశంలో ట్రైనీ కలెక్టర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ క్యాడర్‌లో మంచి పోస్టింగ్ వచ్చి సర్వీసు చేయడం అదృష్టమన్నారు. ప్రజలకు ఉపయోగపడేలా నిర్ణయాలు ఉండాలన్నారు. విధుల్లో చేరినప్పటి నుంచి ఉద్యోగ విరమణ పొందే వరకు కూడా అదే చిరునవ్వుతో పని చేయాలన్నారు. రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిగా మంచి సేవలు అందించారని, మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని సూచించారు. అనంతరం ట్రైనీ కలెక్టర్ ఉమహారతి మాట్లాడుతూ.. కలెక్టర్ ప్రతీక్‌జైన్ పర్యవేక్షణలో శిక్షణ పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్‌డీఓ వాసుచంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఈఓ రేణుకాదేవి, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి మల్లేశం, క్రీడల శాఖ జిల్లా అధికారి హనుమంత్ రావు, డీపీవో జయసుధ తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఉమాహారతికి వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్, జిల్లా అధికారులు

బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: బెట్టింగ్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నారాయణరెడ్డి హెచ్చరించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్టేషన్లవారీగా నమోదైన కేసులపై సమీక్ష జరిపారు. పెండింగ్ కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో బెట్టింగ్, జూదం, ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. మహిళలపై జరిగే నేరాలు, పిల్లలపై జరిగే అఘాయిత్యాలు, సైబర్ నేరాలకు సంబంధించిన కేసులను వేగంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో కళాజాత బృందాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఎర్రమట్టి, ఇసుక, గుట్కా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని తెలిపారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వికారాబాద్, పరిగి, తాండూరు డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణారెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సేవా పతకాలు సాధించడం గర్వకారణం

పోలీసులు సేవా పతకాలు పొందడం మనందరికీ గర్వకారణమని ఎస్పీ నారాయణరెడ్డి కొనియాడారు. 2024లో సేవా పతకాలు పొందిన పోలీస్ అధికారులను శనివారం అభినందించారు.

పతకాలు పొందిన వారు..

హెడ్‌కానిస్టేబుల్ ఎం నారాయణమ్మ, ఏఆర్‌హెచ్‌పీ పి.హన్మిరెడ్డి, ఏఆర్‌హెచ్‌సీ ఎం.శ్రీశైలం, ఎస్‌ఐ అబ్దుల్ హఫీజ్, ఏఎస్‌ఐ ఎం.రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ బి.మాణయ్య, కానిస్టేబుల్ హెచ్.శివ కుమార్ సేవా పతకాలు పొందారు. వీరిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేశ్, అడ్మిన్ ఆర్‌ఐ డేవిడ్ విజయ్, ఆర్‌ఐ అంజాత్ పాషా తదితరులు పాల్గొన్నారు.

వడగళ్ల వాన



మాదిరెడ్డిపల్లి రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు, స్థానికులు

నవాబుపేట: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం వడగళ్ల వర్షం కురిసింది. యావాపూర్, ఎత్‌రాజ్‌పల్లి, పులుమామిడి, లింగంపల్లి, అక్నాపూర్, నారెగూడ, చిట్టిగిద్ద, చిట్టిగిద్ద రైల్వేస్టేషన్ గ్రామాల్లో భారీ వర్షంతోపాటు వడగళ్లు పడ్డాయి. గాలి తీవ్రతకు చిట్టిగిద్ద రైల్వే స్టేషన్ రోడ్‌పై భారీ చెట్టు నేలకొరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రజల సహకారంతో చెట్టును తొలగించారు.

వేప చెట్టుపై పడిన పిడుగు

మండలంలోని మాదిరెడ్డిపల్లి పొలాల్లో సాయంత్రం పిడుగు పడింది. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ శుభాన్ రెడ్డి, లింగంపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు పిడుగు పడిన ప్రాంతానికి పది మీటర్ల దూరంలో ఉన్నట్లు తెలిసింది. వేప చెట్టుపై పిడుగు పడటంతో అది విరిగిపోయిందని వారు తెలిపారు.

ధారూరులో ఉరుములు, మెరుపులతో వాన

ధారూరు: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వర్షం కారణంగా కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో ఉక్కపోతకు గురైన ప్రజలు రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది.

మర్పల్లిలో మోస్తరు వర్షం

మర్పల్లి: మండలంలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దీంతో పొలాల్లో కోసిన పంటలకు నష్టం జరిగింఇ.బిల్‌కల్, తుమ్మలపల్లి, మల్లికార్జున గిరి గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసంది.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: మోమిన్‌పేటలో వడగండ్ల వర్షం కురిసింది. శనివారం వారంతపు సంత ఉండటంతో గాలీవాన, వడగండ్లకు కూరగాయల వ్యాపారులు, రైతులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అకాల వర్షంతో ఉల్లి, కూరగాయల పంటలకు నష్టమని రైతులు తెలిపారు.



నారెగూడలో కురిసిన వడగళ్లు



పిడుగుపాటుకు విరిగిన వేపచెట్టు

క్లుప్తంగా

నేడు తాండూరులో ఎమ్మెల్యే పర్యటన

తాండూరు: పట్టణంలో నేడు(ఆదివారం) ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పలు కార్యక్రమాలకు హాజరు కానున్నారు. ఉదయం ఎస్వీఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న నియోజకవర్గ ఇందిరమ్మ కమిటీ సమావేశానికి హాజరు కానున్నారు. సాయంత్రం పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు ఇవ్వనున్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి బాబుసింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన, అర్హత గల వారు సర్టిఫికెట్‌లతో ఈనెల 24న సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కుల్కచర్ల తైబజార్ వేలం

రూ.9,10,050కు దక్కించుకున్న వెంకట్రాములు



కుల్కచర్ల జీపీలో తైబజార్‌కు వేలం నిర్వహిస్తున్న అధికారులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత మార్కెట్ల అభివృద్ధికి అందరూ సహకరించాలని తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి మురళీధర్, ఇంచార్జి ఎంపీఓ భాస్కర్ అన్నారు. శనివారం కుల్కచర్ల గ్రామ పంచాయతీలో తైబజార్ వేలం నిర్వహించారు. పర్సపురం వెంకట్రాములు రూ.9,10,050కు వేలం హక్కులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ ఫ్రాడ్‌లో అకౌంట్ హోల్డర్ అరెస్టు

సికింద్రాబాద్ వాసి నుంచి రూ.1.22 కోట్లు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: టెలిగ్రామ్ ద్వారా వల వేసి, ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఎర వేసి, సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి నుంచి రూ.1.22 కోట్లు కాజేసిన కేసులో ఓ నిందితుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారులకు అనవరమైన బ్యాంకు ఖాతాలను అందించిన అంకిత్ అరోరాను ఉత్తరప్రదేశ్‌లో పట్టుకున్నట్లు డీసీపీ దార కవిత శనివారం తెలిపారు. సైబర్ నేరగాళ్లు బాధితుడిని గత ఏడాది టెలిగ్రాం యాప్ ద్వారా సంప్రదించారు. ఇతడిని ఓ గ్రూపులో చేర్చిన కేటుగాళ్లు తొలి నాళ్లల్లో ట్రేడింగ్‌కు అవసరమైన టిప్స్ ఇచ్చారు. కొన్నాళ్లకు తాము అందించే ట్రేడింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పి ఆ లింకు పంపారు. దాని ద్వారా ట్రేడి ంగ్ పేరుతో డబ్బు బదిలీ చేయించుకున్నారు. ఇలా మొత్తం రూ.1,22,87,120 బదిలీ చేసిన తర్వాత తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఏసీపీ ఆర్‌జీ శివమారుతి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాద్‌రావు బృందం ఈ కేసు దర్యాప్తు చేసింది. బాధితుడి నగదు బదిలీ అయిన బ్యాంకు ఖాతాల ఆధారంగా ముందుకు వెళ్లిన పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంకిత్ అగర్వాల్‌కు చెందినవిగా గుర్తించారు. ఇతగాడు సూత్రధారుల ఆదేశాల మేరకు కమీషన్ తీసుకుంటూ పని చేస్తూ, వారికి అవసరమైన బ్యాంకు ఖాతాలు అందిస్తుంటాడు. ఇలా దాదాపు రూ.6 కోట్ల ఇతడి బ్యాంకు ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లకు చేరాయి. అంకిత్‌ను అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి కోసం లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) జారీ చేస్తున్నారు.

పుదీనా పల్లెలో భూసేకరణ లొల్లి



గ్రామంలోని పట్టా భూముల్లో సాగవుతున్న పుదీన పంట



మొండిగౌరెల్లి గ్రామం

- 821.11 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను తీసుకోనున్న ప్రభుత్వం
- ఆందోళనలో మొండిగౌరెల్లివాసులు
- ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అభ్యర్థన

యాచారం: పచ్చని పల్లెలో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు అంశాన్ని మొండిగౌరెల్లివాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. పుదీనా, ఆకుకూరల పంటగా ఈ గ్రామానికి ప్రత్యేక పేరుంది. గ్రామంలోని దాదాపు 300 కుటుంబాలకు చెందిన రైతులు పుదీనా సాగుతో ఉపాధి పొందుతున్నారు. తెల్లవారుజామున మూడు గంటల వరకు బస్తాల కొద్ది పుదీనాను మాదన్నపేట, సరూర్‌నగర్ రైతు బజార్ తదితర మార్కెట్లకు తరలించి విక్రయిస్తారు. యాభై ఏళ్లుగా ఇది ఆనవాయితీగా కొనసాగుతోంది. దీంతో ఈ గ్రామాన్ని పుదీనాగౌరెల్లి అని కూడా పిలుస్తున్నారు. తాజాగా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఈ గ్రామాన్ని పుదీనా సాగు కోసం పైలెట్ విలేజ్‌గా ఎంపిక చేసింది.

638 మంది రైతులు

పారిశ్రామిక పార్క్‌ల ఏర్పాటు కోసమని ఈ గ్రామంలోని భూముల సేకరణకు ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. గ్రామంలోని 638 మందికి చెందిన 821.11 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించనున్నట్లు పేర్కొంది. ఇందులో 19 సర్వేనంబరులో 375.27 ఎకరాలు, 68 సర్వేనంబరులో 188.03 ఎకరాలు, 127 సర్వే నంబరులో 113.34 ఎకరాలు కలిపి మొత్తం 498 మంది రైతులకు చెందిన 677.29 ఎకరాల అసైన్డ్ భూమితో పాటు సర్వే నంబరు 69 నుంచి 82 వరకు ఉన్న 140 మంది రైతులకు చెందిన 143.82 ఎకరాల పట్టా భూములను తీసుకోవడానికి సర్కార్ నిర్ణయించింది. నోటిఫికేషన్ ప్రకటనలో పారిశ్రామిక పార్క్‌ల కోసమని ఉంది కానీ ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తారో స్పష్టంచేయలేదు.

ఫ్యూచర్ సిటీలో కలపాలని కోరితే..

యాచారం మండల కేంద్రానికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామాన్ని ఫ్యూచర్ సిటీ యుడీఏలో కలపాలని స్థానికులు కోరారు. ఈ మేరకు పలుమార్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డికి, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రాలు అందించారు. కానీ సాగు చేసుకు బతుకుతున్న భూములను తీసుకునేందుకు వచ్చిన ప్రకటనతో బోరున విలపిస్తున్నారు. అసైన్డ్ సర్వే నంబర్లు 19, 68, 127తో పలు పట్టా సర్వేనంబర్ల భూములపై తరచూ డ్రోన్లు సంచరిస్తున్నాయి. కోట్లాది రూపాయల విలువ చేసే భూములను తీసుకుంటే తమ గతి ఏమిటని వాపోతున్నారు.

ఉన్నత చదువులు చదివి..



ఉన్నత చదువులు చదివినా వ్యవసాయంపై మక్కువతో పుదీనా సాగు చేస్తూ ఉపాధి పొందుతున్నాం. డ్రోన్ల సంచారంతో పట్టా భూములు సైతం తీసుకుంటారేమోనని ఆందోళనగా ఉంది. గ్రామంలో భూసేకరణకు ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలి.

– కుంచారాపు సందీప్‌రెడ్డి, మొండిగౌరెల్లి

స్పష్టత లేదు



మొండిగౌరెల్లిలో పారిశ్రామిక పార్క్‌ల కోసం 822 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ వేశాం. కాని ఏఏ కంపెనీలకు భూములు అప్పగిస్తారనేది ప్రభుత్వం నుంచి మాకు స్పష్టత లేదు. భూసేకరణ విషయమై రైతుల ఇచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారులకు పంపించాం.

– అనంతరెడ్డి, ఆర్డీఓ ఇబ్రహీంపట్నం

అక్రమార్కుల నుంచి రక్షించండి

కరన్‌కోట్ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు



పోలీస్ స్టేషన్ వద్ద గ్రామస్తులతో కలిసి ఫిర్యాదు చేస్తున్న జర్నప్ప(ఎడమ నుంచి రెండో వ్యక్తి)

తాండూరు రూరల్: ఇసుక అక్రమార్కుల తనకు ప్రాణహాని ఉందని మండల పరిధిలోని వీర్‌శెట్టిపల్లికి చెందిన ఫిరంగి జర్నప్ప అవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పలువురు గ్రామస్తులతో కలిసి శనివారం మరోసారి కరన్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యాలాల మండలం అగ్గనూర్‌కు చెందిన మాజీ సర్పంచు భీమప్ప అనుచరులు 20 మంది తనపై అకారణంగా దాడి చేశారన్నారు. గత శుక్రవారం అర్ధరాత్రి వీర్‌శెట్టిపల్లి వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా 100 నంబర్‌తో పాటు కరన్‌కోట్ పోలీసులకు సమాచారం ఇచ్చానన్నారు. అయితే మాపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ భీమప్ప అనుచరులు అర్ధరాత్రి వీర్‌శెట్టిపల్లికి వచ్చి వీరంగం సృష్టించారన్నారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు పంచాయతీ కార్యాలయం సీసీ కెమెరాల్లో నమోదయ్యాయని, వీటిని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. శనివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన భీమప్ప అనుచరులు తనను పీఎస్‌లో మరోసారి బెదిరించారన్నారు. ఈ విషయమై డీఎస్పీ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశానని తెలిపారు. అధికార పార్టీ కార్యకర్తనైన తన పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల సంగతి ఏమిటని ప్రశ్నించారు. ఇసుక అక్రమార్కులకు పోలీసులు కొమ్ముకాస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. జర్నప్పపై దాడి విషయం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లినట్లు తెలిసింది.

డ్రైవర్‌ను బెదిరించి ఆటో తీసుకెళ్లిన ముగ్గురి అరెస్టు

ర్యాపిడోలో బుక్ చేసుకుని...

- మార్గ మధ్యలో ఆటోతో పరార్



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

శంషాబాద్ రూరల్: ర్యాపిడో ఆటోను బుక్ చేసుకున్న ముగ్గురు వ్యక్తులు.. హైదరాబాద్ నుంచి మండల శివారు ప్రాంతానికి వచ్చిన తర్వాత.. డ్రైవర్‌ను బెదిరించి ఆటోను దొంగిలించిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... ఉప్పల్‌లోని మేడిపల్లి ప్రాంతానికి చెందిన బ్రహ్మయాదవ్ ర్యాపిడో ద్వారా ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ నెల 13న ముగ్గురు వ్యక్తులు ఇతని ర్యాపిడో రైడ్‌లో బుక్ చేసుకున్నారు. ఉప్పల్ నుంచి మండలంలోని రాయన్నగూడ వద్దకు రాగా.. రాత్రి 10 గంటల సమయంలో బహిర్భూమి కోసం ఆటోను ఆపారు. తర్వాత డ్రైవర్ బ్రహ్మయాదవ్‌ను బెదిరించి ఆటోతో పరారయ్యారు.

జైలుకు వెళ్లివచ్చినా మారని బుద్ధి...

హైదరాబాద్‌లోని బండ్లగూడ ప్రాంతంలోని మహమ్మద్‌నగర్ వాసి మహ్మద్ రషీద్(26) ఆటో డ్రైవర్‌గా, బాలాపూర్ పరిధిలోని షాహిన్‌నగర్‌కు చెందిన షేక్ హసనుద్దీన్(22) డెకరేషన్ పని, మహ్మద్ ఆరీఫ్(25) ప్లంబర్‌గా పని చేస్తున్నారు. వీరు ర్యాపిడో రైడ్‌లో ఆటోను బుక్ చేసుకున్నారు. మార్గ మధ్యలో డ్రైవర్‌ను బెదిరించి ఆటోను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరు గతంలో దొంగతనం, చైన్ స్నాచింగ్ కేసుల్లో జైలుకి వెళ్లారు. అయినా వారి ప్రవర్తన మార్చుకోలేదు. వీరి నుంచి పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చారు.

రాంగ్‌రూట్‌లో వచ్చి.. బైక్‌ను ఢీకొట్టి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



బాల్‌రాజ్ (ఫైల్)



హరిబాబు (ఫైల్)



గాయాలతో పడి ఉన్న బాల్‌రాజ్, హరిబాబు

షాబాద్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని సంకెపల్లిగూడ పంచాయతీకి అనుబంధ గ్రామమైన శేరిగూడకు చెందిన చీమల బాల్‌రాజ్ (40), హరిబాబు (42) కలిసి శనివారం మధ్యాహ్నం కూలి పనికోసం బాల్‌రాజ్ బైక్‌పై నాగర్‌గూడకు వెళ్తున్నారు. మల్లారెడ్డిగూడ సమీపంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన బైక్ బలంగా ఢీ కొట్టింది. దీంతో బాల్‌రాజ్, హరిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాల్‌రాజ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న హరిబాబును ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాల్‌రాజ్‌కు భార్య హంసమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. హరిబాబు 25 ఏళ్ల క్రితం ఒంగోలు జిల్లా టంగుటూరు నుంచి వలస వచ్చారు. మూడేళ్ల కిత్రం హరిబాబు భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బాల్‌రాజ్ భార్య హంసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తిని, రోడ్డు మధ్యలో డివైడర్ తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మల్లారెడ్డిగూడ, సంకెపల్లిగూడ మాజీ సర్పంచ్‌లు చందిప్ప జంగయ్య, కుమ్మరి దర్శన్, బీజేపీ మండల అధ్యక్షులు మద్దూరు మాణెయ్య డిమాండ్ చేశారు.

దాడి కేసులో నిందితుడికి రిమాండ్

యాచారం: పశువుల మేత విషయంలో ఇద్దరి మధ్యచోటుచేసుకున్న ఘర్షణలో దాడి చేసిన వ్యక్తికి ఇబ్రహీంపట్నం న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ సీఐ కృష్ణంరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ముచ్చర్ల గ్రామంలో పశువుల మేత విషయంలో ఈ నెల 12న అదే గ్రామానికి చెందిన ఎర్ర మల్లయ్య, ఎదిరే కృష్ణయ్య మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో ఎర్ర మల్లయ్య తన చేతిలో ఉన్న గొడ్డలికామతో ఎదిరే కృష్ణయ్యను కొట్టగా అతనికి తీవ్ర గాయమైంది. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి కోర్టుకు నివేదిక సమర్పించారు. ఇబ్రహీంపట్నం న్యాయస్థానం శనివారం ఎర్ర మల్లయ్యకు 14 రోజుల రిమాండ్ విధించింది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

షాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చడం లేదని విమర్శించారు. రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని అన్నారు. బీజేపీకి యువతే కీలకమని యువతీయువకులంతా ఏకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాములుగౌడ్, సుదర్శన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

రెండో రోజు పది పరీక్షలు ప్రశాంతం



తాండూరు రూరల్: కరన్‌కోట్ పరీక్ష కేంద్రాంను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. శనివారం తాండూరు మండలంలోని కరన్‌కోట్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ లేకుండా ప్రశాంతంగా కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ వీరేశం పాల్గొన్నారు.

దౌల్తాబాద్: మండల కేంద్రంలో జరుగుతున్న పది పరీక్షలు రెండో రోజు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రంలో ఉన్న రెండు కేంద్రాల్లో 331 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. శనివారం కేంద్రాలను ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ వెంకట్‌స్వామి పరిశీలించారు. కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ రవిగౌడ్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించామని తెలిపారు.

యాలాల: పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా రెండో రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని అగ్గనూరు, యాలాల బాలుర ఉన్నత పాఠశాల, గౌతమి, ప్రతిభ పాఠశాలల్లో మొత్తం ముగ్గురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు అయినట్లు మండల విద్యాధికారి రమేష్ తెలిపారు.

కొడంగల్: పదో తరగతి పరీక్షలు రెండు రోజు శనివారం ప్రశాంతంగా జరిగాయి. కొడంగల్ పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 887 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. తహశీల్దార్ విజయ కుమార్, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణలు పరీక్షా కేంద్రాల దగ్గరకు వెళ్లి పర్యవేక్షించారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.

నవాబుపేట: మండలంలో మొత్తం 385 మంది విద్యార్థులకు రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదర్శ పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో 200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఒకరు హాజరు కాలేదు. ఉన్నత పాఠశాలలో 185 మంది విద్యార్థులు హిందీ పరీక్ష రాసినట్లు ఎంఈఓ అబ్దుల్‌రెహమాన్ తెలిపారు.

దోమ: దోమ సెంటర్‌లో 204 మంది విద్యార్థులు హాజరు కాగా, దాదాపూర్ సెంటర్‌లో 240 మంది పరీక్షలకు హాజరయ్యారని ఎంఈఓ వెంకట్ తెలిపారు. ఎనిమిది మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని చెప్పారు.

పరీక్షా కేంద్రాలను సందర్శించిన సబ్‌కలెక్టర్



తాండూరులో పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్

తాండూరు: తాండూరు పట్టణంలో జరుగుతున్న పదోతరగతి పరీక్షా కేంద్రాలను శనివారం సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సందర్శించారు. పరీక్షలను ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా ప్రశాంతంగా నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించారు.

బంగారం కొనుగోలు పేరిట ఘరానా మోసం

- అరకిలో బంగారం, 18 వేల డాలర్లతో ఉడాయించిన కేటుగాడు
- గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

రాయదుర్గం: బంగారం కొనుగోలు పేరిట ఇద్దరు వ్యాపారులను బురిడీ కొట్టించిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గచ్చిబౌలి డీఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్సింగికి చెందిన చంద్రశేఖర్ అనే బంగారం వ్యాపారి హోటళ్లకు వెళ్లి..అక్కడ బసచేసే వారిని కలిసి బంగారు ఆభరణాలను విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 20వ తేదీన గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ ఐటీ పార్కు రోడ్డులో ఉన్న సితార హోటల్‌కు వెళ్లగా స్టీవ్‌గాడ్విన్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తనకు 50 తులాల బంగారు బిస్కెట్లతో పాటు 18 వేల అమెరికన్ డాలర్లు కావాలని అతన్ని కోరాడు. అతడు చెప్పిన మాటలు చంద్రశేఖర్ పూర్తిగా నమ్మాడు. ఇదే విషయాన్ని తన స్నేహితుడైన రఫీకి చెప్పాడు, దీంతో ఇద్దరు తమ వద్ద ఉన్న బంగారు బిస్కెట్లు, అమెరికన్ డాలర్లు తీసుకొని ఈ నెల 21వ తేదీన స్టీవ్‌కు ఫోన్ చేశారు. గచ్చిబౌలిలో మూత పడిన సెంట్రల్ మాల్‌పై ఉన్న తన కార్యాలయానికి వాటిని తీసుకొని రమ్మని చెప్పడంతో ఇద్దరు అక్కడికి వెళ్లారు. ఆ భవనంలోని నాలుగవ అంతస్తులోకి వెళ్లగానే స్టీవ్ తన వద్ద ఉన్న యాక్సెస్ కార్డు స్వైప్ చేసి ఇద్దరినీ ఓ అద్దాల గది లోపలికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత వారిద్దరి నుంచి బంగారం బిస్కెట్లు, అమెరికన్ డాలర్లు తీసుకున్న స్టీవ్ ఇప్పుడే డబ్బు తీసుకొస్తానని చెప్పి..వారి దృష్టి మళ్లేలా చేసి అక్కడి నుంచి ఉడాయించాడు. ఇది గమనించిన వ్యాపారులు అతన్ని వెంబడించే ప్రయత్నం చేయగా..యాక్సెస్ కార్డు లేకపోవడంతో డోర్ ఓపెన్‌కాక కాసేపు అక్కడే చిక్కుకొని పోయారు. ఈ లోపు ఆ కేటుగాడు అక్కడి నుంచి కిందకు దిగి కారులో పారిపోయాడు. ఈ మేరకు బాధితులు గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ఆరంభించారు. అయితే నిందితుడు ఉపయోగించిన కారును కొండాపూర్లో అద్దెకు తీసుకున్నట్లు పోలీసులు తమ విచారణలో తేల్చారు. అతను బెంగళూరుకు చెందినవాడుగా గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు.

నీరు లేకుంటే భవిష్యత్తు లేదు

తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: నీరు లేకుంటే భవిష్యత్తు లేదని, మానవ మనుగడ ప్రశ్నార్థకం కానుందని తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత వ్యవసాయ ఇంజనీర్ల సంఘం తెలంగాణ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో కొంగరకలాన్‌లోని శ్లోకా కన్వెన్షన్ హాల్‌లో శనివారం 'తెలంగాణ జల వనరులు–నీటి యాజమాన్యం'పై సదస్సు నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలతో పాటు నీటి యాజమాన్య నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ నల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, రైతు మార్గదర్శి పద్మశ్రీ చింతల వెంకట్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. నీటిని వృథా చేయొద్దని, పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీరు లేకపోతే భవిష్యత్తు లేదనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. భూగర్భ జలాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ.. వాతావరణ సమతుల్యతను కాపాడాలంటే అడవులను పెంచడంతో పాటు, వర్షపు నీటిని ఒడిసిపట్టడానికి వాటర్‌షెడ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. ఎమ్మెల్సీ నల్లికంటి సత్యం మాట్లాడుతూ.. సమర్థవంతమైన నీటి యాజమాన్యం కోసం రాబోయే సంవత్సరాల్లో పలు సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అంతర్జాతీయ నీటి యాజమాన్య నిపుణుడు డాక్టర్ కె.ఎల్లారెడ్డి, జాతీయ నీటి యాజమాన్య నిపుణుడు పీఆర్‌బీ సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేరు ఘనం.. ఊరు శూన్యం!

రెవెన్యూ గ్రామంగా అల్మాస్‌ఖాన్‌పేట్

- 84 సర్వే నంబర్లతో 1,056.26 ఎకరాల విస్తీర్ణం
- ఒక్క ఇల్లు కూడా లేని వైనం
- ప్లేగు మహమ్మారితో తుడిచిపెట్టుకుపోయిన పల్లె
- చరిత్రకు సాక్ష్యంగా కోటబురుజు, ఆంజనేయస్వామి గుడి ఆనవాళ్లు



అల్మాస్‌ఖాన్‌పేట్‌లోని శిథిలావస్థకు చేరిన కోటబురుజు



ఆంజనేయస్వామి ప్రతిమ ఉన్న బండరాయి

కుల్కచర్ల: పేరు గొప్ప ఊరు దిబ్బ అనేలా మారింది అల్మాస్‌ఖాన్‌పేట్ పరిస్థితి. పేరుకు రెవెన్యూ గ్రామమైనా ఈ ఊరులో ఒక్కరంటే ఒక్కరు కూడా నివాసం ఉండరు. పంటపొలాలు తప్ప మనుషులు ఉండేందుకు నివాసాలు లేని.. (ఉర్దూలో బేచిరాగ్) గ్రామంగా మిగిలిపోయింది. అల్మాస్‌ఖాన్‌పేట్ పేరు వింటే చాలు తహసీల్దార్ కార్యాలయం మొదలు ఆర్డీఓ, కలెక్టరేట్ అధికారులు సైతం ఈ భూముల సమస్యలను పరిష్కరించేందుకు తలలు పట్టుకుంటారు. ఉమ్మడి కుల్కచర్ల మండలంలో ప్రస్తుతం 16 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇందులో అల్మాస్‌ఖాన్‌పేట్ ఒకటి. మొత్తం 84 సర్వే నంబర్లతో 1,056.26 ఎకరాల విస్తీర్ణం కలిగిఉంది. ధరణి రికార్డులు కూడా అల్మాస్‌ఖాన్‌పేట్ పేరుతోనే నమోదై ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఊరు ఘనపూర్ అనుబంధ గ్రామంగా కొనసాగుతోంది. దీపంలేని గ్రామంగా మిగిలిన అల్మాస్‌ఖాన్‌పేట్‌లో పూర్వం ప్లేగు మహమ్మారి విజృంభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడ్డారు. మిగిలిన వారు బతుకు జీవుడా అంటూ పక్క గ్రామాలు, ఇతర ప్రాంతాలకు తరలిపోయారు.

రెండే ఆధారాలు

పూర్తిగా శిథిలమై ఆనవాళ్లు కోల్పోయిన అల్మాస్‌ఖాన్‌పేట్‌లో చరిత్రకు సాక్ష్యంగా కేవలం రెండు ఆధారాలు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇందులో ఒకటి రాతిబండపై ఆంజనేయస్వామి ప్రతిమ, రెండోది శిథిలమైన కోటబురుజు. ఇక్కడి రైతులు పంటలు చేతికొచ్చిన సమయంలో ఇప్పటికీ ఆంజనేయస్వామికి పూజలు చేస్తారు.